# పరిశోధన
Telugu Daily
నిజం మా ఇజం..






ఆదివారం | 18.10.2026 | Published From Hyderabad | పేజీలు : 4


# కళతో చైతన్యం..పొదుపుతో భవిష్యత్తు..!




- యువ కళాకారులకు భట్టి విక్రమార్క పిలుపు
- ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుదల
- ప్రజల్లో అవగాహన పెంచేందుకు సినీ ప్రముఖులు ముందుకు రావాలి
- 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' అవార్డుల ప్రదానం

**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేలా యువ కళాకారులు తమ సృజనాత్మకతను ఉపయోగించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగిస్తూ పొదుపు పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ కళాకారులు రూపొందించే లఘు చిత్రాలు, పాటలు ప్రజలపై ప్రభావం చూపగలవని, వాటి ద్వారా సామాజిక బాధ్యతతో కూడిన సందేశా లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో అక్టోబర్ నెలలోనే గతంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ డిమాండ్ పెరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవ సరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను ఆపివేయడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని తరువాయి 2లో..

## సద్దుల బతుకమ్మకు
# సర్వం సిద్ధం..

పూల పండుగకు పల్లెపల్లెనా పులకింత!
ఆటపాటలతో తెలంగాణ అంతటా సంబురం..

- తీరొక్క పూలతో బతుకమ్మల పేర్పు.. ఇంటింటా పండుగ కళ
- ఆడపడుచుల ఆటపాటలతో మారుమోగనున్న పల్లెలు.. పట్టణాలు
- పుట్టింటి అనుబంధాలు.. జానపదాల సందడి.. సంప్రదాయాల పరిమళం
- తంగేడు, గునుగు పూలతో ప్రకృతికి పూల నీరాజనం, చెరువులు, వాగుల వద్ద నిమజ్జనాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- పూల సేకరణ నుంచి బతుకమ్మ పేర్పు వరకు కుటుంబాల భాగస్వామ్యం
- పూల విక్రయాలతో కూలీలు, చిరు వ్యాపారులకు అదనపు ఉపాధి

2లో



## పిల్లలకు ఇంటర్నెట్ హక్కు నిరాకరించలేం

- పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు అవసరం
- సంపూర్ణ నిషేధం పరిష్కారం కాదన్న సుప్రీంకోర్టు
- పిల్లల స్వేచ్ఛ, రక్షణ రెండూ ముఖ్యమే
- ఆన్‌లైన్ వేధింపుల కట్టడికి జాతీయ సమాచార నిధి




**న్యూఢిల్లీ , అక్టోబర్ 17 :**

పిల్లలకు ఇంటర్నెట్ అందుబాటును పూర్తిగా నిరాకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌ను వినియోగించుకునేహక్కు రాజ్యాంగంలోని 2లో..

# గోదావరి టు కావేరీ!

- గోదావరి--కావేరీ అనుసంధానంపై హరీశ్‌రావు అభ్యంతరం
- తెలంగాణ నీటి హక్కులకు నష్టం జరుగుతుందని ఆరోపణ
- నవంబర్ 3న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం ఎజెండాపై ప్రస్తావన
- చంద్రబాబు ప్రతిపాదనకు రేవంత్‌రెడ్డి మద్దతిస్తున్నారంటూ విమర్శ
- సాగునీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమంటూ ధ్వజం




**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

తెలంగాణ నీటి హక్కులకు గోదావరి--కావేరీ నదుల అనుసంధానం ద్వారా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో తరువాయి 2లో..

## మూడు దశల్లో
# సమగ్ర భూసర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి.. అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు
- వచ్చే నెలాఖరుకు తొలి దశ పూర్తి చేయాలని లక్ష్యం
- మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు
- పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూధార్ పట్టాల పంపిణీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

తెలంగాణలో భూసమస్యలు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూసర్వేను మూడు దశ ల్లో పూర్తి చేయనున్నట్లు రెవెన్యూ, గృహ తరువాయి 2లో..



# రైతుకు భరోసా.. పంటకు ధర!

- రైతు సంక్షేమానికి 'ఖేత్ బచావో' అభియాన్
- అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు
- భూసార పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన
- 315 మండలాల్లో కరవు తరహా పరిస్థితులు: తుమ్మల నాగేశ్వరరావు
- పంటలకు మద్దతు ధర, ప్రత్యేక ఆర్థిక సాయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం



**హైదరాబాధ్, అక్టోబర్ 17 :**

నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, నీటిసంర క్ష ణ, పంటల వైవిధ్యీకరణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిం చే లక్ష్యంతో కేంద్ర తరువాయి 2లో..

## భారతీయ ఉద్యోగులపై
# అమెరికా నిబంధనల ప్రభావం




- హెచ్-4 వీసాదారులకు ఆటోమేటిక్ పొడిగింపు రద్దు
- ఉద్యోగ అనుమతి పత్రం గడువు ముగిస్తే పనిచేయలేని పరిస్థితి
- భారతీయ కుటుంబాల ఆర్థిక భద్రతపై ఆందోళన
- పునరుద్ధరణ దరఖాస్తులను ముందుగానే చేసుకోవాలని సూచన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 :**

అమెరికా ప్రభుత్వం ఉద్యోగ అనుమతి పత్రాల పునరుద్ధరణకు సంబంధించిన నిబంధనల్లో కీలక మార్పు తీసుకొచ్చింది. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ తరువాయి 2లో..

## న్యాయం కోసం
# ధైర్యంగా నిలబడండి

- రాజ్యాంగ విలువలను కాపాడాలి
- న్యాయవిద్యార్థులకు సీజేఐ సూర్యకాంత్ పిలుపు
- నిజాయతీ, నిష్పాక్షికతే న్యాయవృత్తికి పునాది
- ప్రలోభాలకు లొంగకుండా బాధ్యతలు నిర్వర్తించాలి




2లో

పరిశోధన
Telugu Daily
నిజం మా ఇజం..



# సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం..

**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

"బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.." అంటూ తెలంగాణ పల్లెలు, పట్టణాలు జానపద గీతాలతో మారుమోగనున్నాయి. తీరొక్క రంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడపడుచులు చేరి ఆటపాటలతో సందడి చేసే సద్దుల బతుకమ్మ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. వారం రోజులుగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు పెద్ద బతుకమ్మతో ముగియనున్నాయి. ఎక్కడ చూసినా పూల పరిమళాలు.. ఇంటింటా పండుగ సందడి కనిపిస్తోంది.

బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. ప్రకృతిని ఆరాధించడం, కుటుంబ అనుబంధాలను గుర్తు చేసుకోవడం, తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవడం. వివాహమైన ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని తల్లిదండ్రులు, తోబుట్టువులు, స్నేహితులతో కలిసి వేడుకల్లో పాల్గొంటారు. కుటుంబ బాధ్యతల మధ్య గడిపే మహిళలకు ఈ పండుగ ఆనందాన్ని, ఆత్మీయతను పంచుతుంది. పురాణ గాథలు, పల్లె జీవితం, కుటుంబ అనుబంధాలు, బతుకు కష్టసుఖాలు బతుకమ్మ పాటల్లో ప్రతిధ్వనిస్తాయి.

**- పూలలో ప్రకృతి.. పాటల్లో సంప్రదాయం**

తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చుతారు. తెల్లవారుజామునే పురుషులు, పిల్లలు పూల సేకరణకు వెళ్లి ఇంటికి తీసుకొస్తారు. కుటుంబ సభ్యులంతా కలిసి పూలను పేర్చి గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం మహిళలు కొత్త దుస్తులు ధరించి ప్రధాన కూడళ్లలో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతారు. చిన్నారులు సైతం పెద్దల నుంచి పాటలు, ఆచారాలను నేర్చుకుంటూ తెలంగాణ జానపద సంపదను ముందుకు తీసుకెళ్తున్నారు.

**- సద్దుల బతుకమ్మకు ప్రత్యేక శోభ**

సద్దుల బతుకమ్మ రోజున ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి గౌరమ్మను పూజిస్తారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా చెరువులు, కుంటలు, వాగుల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. "పోయిరా బతుకమ్మ.. పోయిరావమ్మా.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా.." అంటూ ఆడపడుచులు వీడ్కోలు పలుకుతారు. ఈ సమయంలో పుట్టింటి జ్ఞాపకాలు, కుటుంబ అనుబంధాలు మహిళల మనసులను తాకుతాయి.

పండుగను పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో స్థానిక సంస్థలు నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లు చేస్తున్నాయి. విద్యుత్ దీపాలు, నీటి సౌకర్యం, పారిశుధ్యంపై దృష్టి సారిస్తున్నాయి. మహిళలు, చిన్నారులు సురక్షితంగా వేడుకల్లో పాల్గొనేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారు.



**- పూలతో పాటు ఉపాధి పరిమళాలు**

బతుకమ్మ సంబరాలు కూలీలు, చిరు వ్యాపారులకు ఉపాధిని కల్పిస్తున్నాయి. పూలను సేకరించి మార్కెట్లలో విక్రయించేందుకు గ్రామీణ మహిళలు, కూలీలు ముందుకొస్తున్నారు. పండుగ సమీపించడంతో తంగేడు, గునుగు తదితర పూలకు గిరాకీ పెరుగుతోంది. పూల విక్రయాలతో పాటు పూజా సామగ్రి, పిండి వంటలు, దుస్తుల వ్యాపారాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఇలా బతుకమ్మ పండుగ సంప్రదాయాల పరిరక్షణతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తోంది.

**- తరతరాలకు తెలంగాణ వారసత్వం**

బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు, కుటుంబ అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తోంది. పెద్దలు పాడిన పాటలను చిన్నారులు నేర్చుకోవడం, కుటుంబాలన్నీ కలిసి వేడుకల్లో పాల్గొనడం సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతోంది. పూలతో పేర్చిన బతుకమ్మలో ప్రకృతి సౌందర్యం కనిపిస్తే.. పాటల్లో తెలంగాణ ప్రజల జీవనశైలి ప్రతిబింబిస్తుంది. పెద్ద బతుకమ్మతో సంబరాలు ముగిసినా.. ఆడపడుచుల ఆనందం, పుట్టింటి అనుబంధాలు, పండుగ జ్ఞాపకాలు మాత్రం మనసుల్లో నిలిచిపోతాయి. అందుకే తెలంగాణ అంతటా ఒకే స్వరం వినిపిస్తోంది.. "బతుకునివ్వమ్మా.. బతుకమ్మా.. పాడిపంటలతో మళ్లీ రావమ్మా!"

# గోదావరి టు కావేరీ!



(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఈ అంశంపై మాట్లాడారు. నవంబర్ 3న ఢిల్లీలో జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం జరగనుందని, ఆ సమావేశం ఎజెండాలో గోదావరి--కావేరీ అనుసంధాన అంశాన్ని చేర్చి వివిధ రాష్ట్రాలకు పంపించారని తెలిపారు. ఈ ప్రతిపాదన తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి రావాల్సిన నదీ జలాల విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని, తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అనుసంధాన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2026 అక్టోబర్ 7న పోలవరం నుంచి గోదావరి--కావేరీ అనుసంధానాన్ని చేపట్టాలని, ఈ అంశాన్ని సమావేశం ఎజెండాలో చేర్చాలని లేఖ రాసినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆ లేఖ అనంతరమే ప్రతిపాదనను ఎజెండాలో చేర్చి నవంబర్ 3న సమావేశం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారని ఆరోపించారు. తొలుత పోలవరం--బనకచర్ల అనుసంధానం పేరుతో గోదావరి నుంచి 200 టీఎంసీల నీటిని తరలించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారని, ఆ తర్వాత నల్లమలసాగర్ పేరుతో మరో రూపంలో ప్రయత్నించారని విమర్శించారు. ఇప్పుడు గోదావరి--కావేరీ అనుసంధానం పేరుతో పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జునసాగర్, సోమశిల మీదుగా కావేరికి నీటిని తరలించే ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారని తెలిపారు. గతంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడంతో కొత్త మార్గంలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రతిపాదనలో తెలంగాణ ప్రయోజనాలకు తగిన ప్రాధాన్యం లేదని, రాష్ట్ర నదీ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జలాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, ఆంధ్రప్రదేశ్ చేపట్టే ప్రాజెక్టుల విషయంలో ముందుగానే అప్రమత్తమై అభ్యంతరాలు తెలియజేయాలని అన్నారు. గతంలో బనకచర్ల ప్రతిపాదనపై పలుమార్లు హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన రీతిలో స్పందించలేదని ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటా, భవిష్యత్తులో సాగునీటి అవసరాలు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నుంచి ఇతర నదీ పరివాహక ప్రాంతాలకు నీటిని తరలించే ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్రంతో చర్చించి తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలగకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, పంటలకు నీటి సరఫరా అంశాలపైనా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికే జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు లేని పరిస్థితి ఉందని, రైతులకు సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తొమ్మిది నెలలుగా హెచ్చరించినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో పది మోటార్లు నడపాల్సిన చోట మూడు మోటార్లనే ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించినట్లు తెలిపారు. అన్ని మోటార్లను సమర్థంగా వినియోగించి ఉంటే చెరువులు, చెక్‌డ్యాంలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగేవని, వరంగల్ ప్రాంతంలో సాగునీటి ఇబ్బందులు కొంతవరకు తగ్గేవని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీశైలం జలాశయంలో నీరు ఉన్నప్పటికీ అవసరమైన స్థాయిలో ఎత్తిపోతలు చేపట్టలేదని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోనూ మోటార్ల నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తారు. నీటి నిర్వహణలో లోపాల వల్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ అక్కడ పంటల సాగుకు విరామం ప్రకటించలేదని, తెలంగాణలో మాత్రం పంటలు వేయవద్దని సూచించే పరిస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. నీటి నిర్వహణలో ప్రభుత్వ నిర్ణయాలు రైతుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. నీటిని కొనుగోలు చేయడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి చెబుతున్నప్పుడు, అందుబాటులో ఉన్న జలాలను సమర్థంగా వినియోగించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు.

తెలంగాణ నీటి హక్కులను పరిరక్షించడంతోపాటు సాగు నీటి ప్రాజెక్టుల నిర్వహణ, ఎత్తిపోతల పథకాల సామర్థ్య వినియోగం, రిజర్వాయర్లలో నీటి నిల్వల పెంపుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. గోదావరి--కావేరీ అనుసంధాన ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని, తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే నిర్ణయాలను అడ్డుకోవాలని కోరారు. కాగా, ఈ అంశాలపై హరీశ్‌రావు చేసిన ఆరోపణలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించే వివరణలు తెలియాల్సి ఉంది.

# మూడు దశల్లో సమగ్ర భూసర్వే

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ఆయా గ్రామాల్లో భూయజమానుల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వచ్చే నెలాఖరులోగా తొలి దశ సర్వేను పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని వివరించారు. సర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే కొనుగోలు చేసిన 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి భూసర్వే పురోగతిని పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ సమస్యలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర భూసర్వేకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేశామని, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు 285 గ్రామాల్లో సర్వే పూర్తయిన నేపథ్యంలో మిగిలిన గ్రామాల్లోనూ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది జీవనాధారమని పేర్కొన్న మంత్రి, ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ గుర్తింపు, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలను తగ్గించడంతో పాటు భూయాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంలో ఈ సర్వే కీలకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కాలక్రమేణా భూముల విభజనలు పెరగడం, సర్వే నంబర్ల ఉపవిభాగాలు ఏర్పడటం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంప్రదాయ కొలత పరికరాలకు బదులుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఉపయోగించిన గొలుసులు, కర్రలు, కొలత పట్టీల స్థానంలో డీజీపీఎస్, రోవర్లు, భౌగోళిక సమాచార వ్యవస్థ వంటి సాంకేతిక విధానాలతో భూములను శాస్త్రీయంగా కొలుస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేయగా, మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. ఈ పరికరాల వినియోగంతో సర్వే పనుల్లో వేగం, కొలతల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు సేకరించిన సమాచారాన్ని డిజిటల్ రూపంలో భద్రపరిచేందుకు వీలవుతుందని వివరించారు. సమగ్ర భూసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ నంబరు కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపు కల్పించేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని సంబంధిత సాంకేతిక వ్యవస్థలో నమోదు చేసి, భూ భారతి పోర్టల్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు. రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. సర్వే ద్వారా ప్రతి భూకమతానికి ప్రత్యేక పటం సిద్ధం చేయడం వల్ల భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. భూయాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడం ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, భూముల హద్దుల విషయంలో తలెత్తే వివాదాలను పరిష్కరించేందుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో మొత్తం 665 ఎకరాల్లో వందశాతం భూసర్వే విజయవంతంగా పూర్తయిందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అక్కడ త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సర్వే నిర్వహించే ముందు సంబంధిత పట్టాదారులకు తప్పనిసరిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని, సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు గ్రామాల్లో చాటింపు వేయించాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల భూయజమానులు ముందుగానే సమాచారం తెలుసుకొని తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన గుర్తులు ఏర్పాటు చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా చూడాలని, సర్వే పూర్తయిన గ్రామాల్లో భూయజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. భూసర్వేను కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా గుర్తించాలని, ప్రజల సంతృప్తికి ప్రాధాన్యం ఇస్తూ సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కళతో చైతన్యం.. పొదుపుతో భవిష్యత్తు!



(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. నీటివినియో గం లోనూ పొదుపు పాటించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. నీరు, విద్యుత్ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారా భవిష్యత్తు లో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు యువ కళాకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, సామాజిక మాధ్యమాల్లో ప్రభావం చూపుతున్న వ్యక్తులు నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చొరవ తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కోరారు. సినీ ప్రముఖులు, యువ కథానాయకులు, సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరువయ్యే వ్యక్తులు ఇచ్చే సందేశాలు సమాజంపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ప్రజల్లో మంచి అలవాట్లను పెంపొందించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు వంటి అంశాలను సృజనాత్మకంగా ప్రజలకు వివరించడం ద్వారా సామాజిక మార్పునకు దోహదపడవచ్చని తెలిపారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేశారు. లఘు చిత్రాలతో పాటు ప్రభుత్వ పథకాలపై రూపొందించిన పాటల విభాగాల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన వారిని నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలతో సత్కరించారు. యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీయడంతోపాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువ చిత్రకారులు, దర్శకులు తమ ప్రతిభను సమాజానికి ఉపయోగపడే అంశాలపై కేంద్రీకరించాలని ఈ సందర్భంగా సూచించారు. అవార్డుల ప్రదానోత్సవం శిల్పకళా వేదికలో సందడిగా సాగింది. ముఖ్యమంత్రి పిలుపు నకు స్పందించి ముందుకొచ్చిన యువ కథానాయకుడు విజయ్ దేవర కొండను భట్టి విక్రమార్క అభినందించారు. ప్రజలకు ఉపయోగపడే సందేశా లను విస్తృతంగా తీసుకెళ్లేందుకు సినీ పరిశ్రమకు చెందిన వారు సహ కరించడం అవసరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు యువ కళాకారులు, సినీ ప్రముఖులు, సామాజిక మాధ్యమాల ప్రభావశీలులు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వనరుల వినియోగంలో బాధ్యతాయుతమైన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్యమని, సృజనాత్మక కళారూపాల ద్వారా ఈ సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయవచ్చని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## భారతీయ ఉద్యోగులపై అమెరికా నిబంధనల ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

(ఈఏడీ) గడువు ముగిసినప్పటికీ, పునరుద్ధరణ దరఖాస్తు పెండింగ్‌లో ఉన్న వారికి గతంలో కల్పించిన గరిష్ఠంగా 540 రోజుల స్వయంచాలక పొడిగింపు సౌకర్యాన్ని రద్దు చేస్తూ తుది నిబంధనను జారీ చేసింది. అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం అక్టోబర్ 14, 2026న ఈ నిబంధనను ఖరారు చేసింది. 2025 అక్టోబర్ 30న తీసుకొచ్చిన తాత్కాలిక నిర్ణయాన్నే ఇప్పుడు తుది నిబంధనగా అమలు చేస్తోంది. గతంలో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం కారణంగా ఉద్యోగ అనుమతి పత్రాల గడువు ముగిసినా, అర్హులైన దరఖాస్తుదారులు నిర్దిష్ట కాలం పాటు ఉద్యోగాలు కొనసాగించేందుకు అవకాశం ఉండేది. తాజా మార్పుతో ఆ వెసులుబాటు గణనీయంగా తగ్గింది. ఈ నిర్ణయం ముఖ్యంగా హెచ్-1బీ వీసాలపై అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణుల జీవిత భాగస్వాములైన హెచ్-4 వీసాదారులపై ప్రభావం చూపనుంది. హెచ్-4 వీసాపై ఉన్న కొందరు జీవిత భాగస్వాములు ఉద్యోగాలు చేసేందుకు ఈఏడీ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. అలాంటి వారు పునరుద్ధరణ కోసం గడువులోగా దరఖాస్తు చేసినప్పటికీ, పాత అనుమతి పత్రం గడువు ముగిసేలోపు కొత్త పత్రం రాకపోతే ఉద్యోగానికి తాత్కాలికంగా దూరం కావాల్సి రావచ్చు. అక్టోబర్ 30, 2025న లేదా ఆ తర్వాత దాఖలు చేసిన అర్హతగల పునరుద్ధరణ దరఖాస్తులకు సాధారణంగా 540 రోజుల స్వయంచాలక పొడిగింపు వర్తించదు. అయితే, గతంలోనే అర్హత మేరకు పొందిన పొడిగింపులను ఈ నిబంధన వెనక్కి తీసుకోదు. చట్టం లేదా ప్రత్యేక ప్రభుత్వ ప్రకటనల ద్వారా కల్పించే కొన్ని మినహాయింపులు కూడా కొనసాగవచ్చు. కొత్త నిబంధనతో అమెరికాలో పనిచేస్తున్న భారతీయ కుటుంబాల్లో ఉద్యోగ భద్రత, ఆదాయ స్థిరత్వంపై ఆందోళనలు పెరుగుతున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ కుటుంబ ఖర్చులు, ఇంటి అద్దె, పిల్లల చదువులు, ఇతర అవసరాలను నిర్వహిస్తున్న కుటుంబాల్లో ఒకరి ఉద్యోగానికి విరామం ఏర్పడితే ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కొత్త ఉద్యోగ అనుమతి పత్రం కోసం ఎక్కువ కాలం వేచి చూడాల్సి వస్తే ఆదాయం నిలిచిపోవడమే కాకుండా, తిరిగి ఉద్యోగంలో చేరే విషయంలోనూ సమస్యలు ఎదురుకావచ్చు. ఉద్యోగ అనుమతి గడువు ముగిసిన తర్వాత కూడా పని కొనసాగించడం చట్టపరమైన సమస్యలకు దారితీయవచ్చు కాబట్టి, సంబంధిత నిబంధనలను ముందుగానే తెలుసుకోవడం అవసరం. ఈ మార్పు ప్రభావం వ్యక్తుల వీసా వర్గం, ఉద్యోగ అనుమతి అర్హత, దరఖాస్తు తేదీ, వర్తించే మినహాయింపులపై ఆధారపడి ఉంటుంది. అయితే, ఎఫ్-1 విద్యార్థి వీసాపై చదువుతున్న వారిలో అర్హతగల విజ్ఞాన, సాంకేతిక, ఇంజినీరింగ్, గణితశాస్త్ర విభాగాల విద్యార్థులకు వర్తించే ఐచ్ఛిక ప్రాయోగిక శిక్షణ పొడిగింపుపై ఈ నిర్ణయం ప్రభావం చూపదని సంబంధిత వార్తా కథనాలు పేర్కొన్నాయి. అలాగే ఎల్-2, ఈ వీసాలపై ఉన్న అర్హతగల జీవిత భాగస్వాములు తమ వలస హోదా ఆధారంగా ఉద్యోగం చేసేందుకు అనుమతి పొందే పరిస్థితులు వేరుగా ఉంటాయి. అందువల్ల ప్రతి వీసా వర్గానికి ఒకే నిబంధన వర్తిస్తుందని భావించకూడదు. తమ ఉద్యోగ అనుమతి పత్రం ఏ వర్గానికి చెందింది, దాని గడువు ఎప్పుడు ముగుస్తుంది, పునరుద్ధరణ దరఖాస్తు ఎప్పుడు దాఖలైంది, తమకు ఏవైనా మినహాయింపులు వర్తిస్తాయా అనే అంశాలను సంబంధిత అధికారిక మార్గదర్శకాల ఆధారంగా పరిశీలించుకోవాలి. ఈ నేపథ్యంలో ఈఏడీ పునరుద్ధరణ అవసరమైనవారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని వలస నిపుణులు సూచిస్తున్నారు. ఆరు నుంచి ఎనిమిది నెలల ముందుగా ప్రక్రియను ప్రారంభించే అవకాశాన్ని పరిశీలించడం, దరఖాస్తు రసీదులు, అనుమతి పత్రాల గడువులు, ఉద్యోగానికి సంబంధించిన ఆధారాలను భద్రపరచుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, ముందుగా దరఖాస్తు చేసినంత మాత్రాన కొత్త అనుమతి పత్రం సకాలంలో వస్తుందని హామీ ఉండదు. కాబట్టి ఉద్యోగదారులతో ముందుగానే సంప్రదింపులు జరపడం, అవసరమైతే అర్హతగల వలస న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం ముఖ్యం. అమెరికాలో స్థిరపడిన భారతీయ కుటుంబాలకు ఈ నిబంధన మార్పు ఉద్యోగ ప్రణాళికలు, కుటుంబ ఆదాయం, భవిష్యత్తు నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో, అధికారిక మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం అవసరం.

పరిశోధన
Telugu Daily
నిజం మా ఇజం..
18.10.2026
ఆదివారం



# మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తా

- కొంపల్లిలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాదయాత్ర
- తాగునీటి సరఫరాలో ఒత్తిడి పెంచాలని అధికారులకు సూచన
- ప్రధాన రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశం
- రాత్రివేళ చెత్త వేస్తున్న వారిపై నిఘా పెట్టాలని స్పష్టీకరణ



**కొంపల్లి, అక్టోబర్ 17 :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధితోపాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. కొంపల్లి పురపాలక సంస్థ పరిధిలోని కొంపల్లి సర్కిల్ విధాత్రి విల్లాస్‌లో అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ప్రధాన రహదారిపై చెత్త వేయడం వంటి సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించడం అభివృద్ధిలో ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు .విధాత్రి విల్లాస్‌తోపాటు సమీప కాలనీల్లో తాగునీరు తక్కువ ఒత్తిడితో సరఫరా అవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. అవసరమైన స్థాయిలో నీరు అందకపోవడంతో రోజువారీ పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే తాగునీటి సరఫరాలో ఒత్తిడిని పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులకు తగినంత నీరు అందేలా సరఫరా వ్యవస్థను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తాగునీరు ప్రతి కుటుంబానికి అత్యవసరమైన సదుపాయమని, ఈ విషయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు తగిన శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.కొంపల్లి నుంచి విధాత్రి విల్లాస్‌కు వచ్చే ప్రధాన రహదారిపై వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణించేవారు భయాందోళనకు గురవుతున్నారని కాలనీవాసులు తెలిపారు. చీకటి కారణంగా రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోందని, ముఖ్యంగా రాత్రి సమయంలో కాలనీకి వచ్చేవారు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రధాన రహదారిపై వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. రహదారిపై తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కాలనీలకు వెళ్లే ప్రధాన మార్గాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజలకు భద్రతతో కూడిన ప్రయాణ సౌకర్యం అందించవచ్చని తెలిపారు.ప్రధాన రహదారిపై రాత్రివేళల్లో కొందరు ఇష్టానుసారంగా చెత్త వేస్తున్నారని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనివల్ల పరిసరాల పరిశుభ్రత దెబ్బతినడంతోపాటు స్థానికులకు అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. ఈ సమస్యపై స్పందించిన కేపీ వివేకానంద్ రాత్రి సమయాల్లో చెత్తను అక్రమంగా పారవేయకుండా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. రహదారుల వెంట చెత్త వేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంలో సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పాదయాత్రలో విధాత్రి విల్లాస్ సంక్షేమ సంఘం సభ్యులు, కొంపల్లి మున్సిపల్ డీసీ లావణ్య, మాజీ చైర్మన్ సన్న కవితా శ్రీశైలం యాదవ్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, నాయకులు పూజారి లక్ష్మణ్ గౌడ్, క్రిష్ణ సాగర్, షన్ను భాయ్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అవసరమైన సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాల పరిష్కారానికి చర్యలు చేపట్టడమే లక్ష్యమని తెలిపారు.

# పిల్లలకు ఇంటర్నెట్ హక్కు నిరాకరించలేం

(మొదటి పేజీ తరువాయి)

21వ అధికరణం, 19(1)(ఎ) అధికరణం కింద కల్పించిన ప్రాథమిక హక్కులతో ముడిపడి ఉందని పేర్కొంది. పిల్లల భద్రత పేరుతో వారిని పూర్తిగా అంతర్జాలానికి దూరం చేయడం సరైన చర్య కాదని అభిప్రాయపడింది. పిల్లల రక్షణకు, వారి స్వేచ్ఛకు మధ్య వైరుధ్యం లేదని, ఈ రెండింటినీ సమానంగా కాపాడాల్సిన బాధ్యత ఉందని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సామాజిక మాధ్యమాలు, ఇతర అంతర్జాల సేవల్లో పిల్లలపై లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన అంశాలను గుర్తించి తొలగించే వ్యవస్థలను బలోపేతం చేయడానికి సంబంధించిన ఆదేశాలు జారీ చేసే క్రమంలో న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. పిల్లల భద్రతను నిర్ధారించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అందుకోసం వారికి సమాచారాన్ని తెలుసుకునే అవకాశాలను పూర్తిగా మూసివేయడం సమంజసం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇంటర్నెట్ ద్వారా భావాలను వ్యక్తం చేయడంతోపాటు సమాచారాన్ని తెలుసుకోవడం, పొందడం, ఇతరులతో పంచుకోవడం వంటి హక్కులు కూడా ముడిపడి ఉన్నాయని సుప్రీంకోర్టు వివరించింది. అంతర్జాలం అనేది ఆలోచనలు, సృజనాత్మకత, సమాచార మార్పిడికి ఉపయోగపడే వేదిక అని పేర్కొంది . ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే పిల్లలకు విద్యను అభ్యసించడానికి, అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవడానికి ఇంటర్నెట్ ప్రధాన సాధనంగా ఉంటోందని తెలిపింది. అందరికీ సమానంగా విద్యా అవకాశాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో అంతర్జాలం ద్వారా పిల్లలు అనేక విషయాలను నేర్చుకునే అవకాశం పొందుతున్నారని వివరించింది. ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఇతరులతో పరిచయాలు పెంచుకోవడానికి, తమలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న వారితో అనుసంధానం కావడానికి కూడా అంతర్జాల వేదికలు తోడ్పడుతున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో పిల్లల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించడం వల్ల వారికి అందే విద్యా, సమాచార, సామాజిక ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉందన్న అంశాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.ప్రస్తుతం అంతర్జాలం పిల్లలకు పూర్తిగా సురక్షితమైన వేదిక కాదని సుప్రీంకోర్టు అంగీకరించింది. అయితే, అందులో ప్రమాదాలు ఉన్నాయనే కారణంతో పిల్లలను పూర్తిగా దూరం పెట్టడం సరైన పరిష్కారం కాదని స్పష్టం చేసింది. పిల్లలు ఇంటర్నెట్ వినియోగించకూడదని నిబంధనలు విధించినంత మాత్రాన వారు దాని వినియోగాన్ని పూర్తిగా ఆపేస్తారని భావించలేమని పేర్కొంది. అటువంటి ఆంక్షల వల్ల పిల్లలు నియంత్రణ లేని అంతర్జాల వేదికలు, వెబ్‌సైట్లను ఆశ్రయించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆన్‌లైన్‌లో ప్రలోభాలకు గురైనప్పుడు, బెదిరింపులు ఎదురైనప్పుడు లేదా వేధింపులకు గురైనప్పుడు పిల్లలు తమకు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పేందుకు వెనుకాడే పరిస్థితులు ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ఇంటర్నెట్ వినియోగించినందుకు తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో సమస్యలను దాచిపెట్టే అవకాశం ఉందని వివరించింది. అందువల్ల పిల్లలను అంతర్జాలానికి పూర్తిగా దూరం చేయడం కంటే, వారు సురక్షితంగా వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవడం అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది.పిల్లల వయసుకు తగిన భద్రతా చర్యలను సుప్రీంకోర్టు వ్యతిరేకించలేదు. తల్లిదండ్రుల అనుమతి, మార్గదర్శకత్వం, పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. పిల్లల ఖాతాల కోసం ప్రత్యేకంగా బాలల భద్రతా విధానాన్ని ప్రవేశపెట్టడం, ఖాతాలను ముందుగానే వ్యక్తిగతంగా ఉంచడం, తెలియని పెద్దల నుంచి వచ్చే సందేశాలు, పరిచయాలను పరిమితం చేయడం వంటి చర్యలను ప్రస్తావించింది. పిల్లలకు చూపించే ప్రకటనలు, ఇతర సమాచార అంశాలపై కూడా తగిన నియంత్రణలు ఉండాలని సూచించింది.

